


# మరో జలియన్ వాలాబాగ్...

మరువాడ రాజేశ్వర రావు


ఒకనాడు ఊళ్ళోని జనం అంతా ఒక చోట చేరేరు, అది పెద్ద మైదానం. అప్పుడు తీవ్రంగా ఎండ కాస్తోంది. ఎండ చాలా కాంతివంతంగా ఉందిట. కాంతివంతంగా ఉన్నప్పటికీ చురుగ్గా, వేడిగా దొంగదెబ్బలాంటి ఎండ దెబ్బ తినిపిస్తోందిట. అప్పుడు జనానికి ఆ కాంతి చీకటిలాగ తోచిందిట.

అక్కడ చేరిన జనానికి స్వతంత్రం లేదుట. వాళ్ళదేదీ వాళ్ళకొక్కకుండా ఎవరో దోచుకుంటున్నారుట. ఇలాగ దోచుకుంటున్నారు మాకు న్యాయం చెయ్యండని అడిగితే, దోచుకోడం న్యాయ ప్రకారమే జరుగుతోందని న్యాయస్థానాలు తీర్పు చెప్పేయట. ఈ న్యాయాన్ని మేం అంగీకరించం అన్నీ వాళ్ళని జైళ్ళలోకి తోసేరుట. కొందర్ని ఉరితీసి చంపేరుటకూడా.

అంతేకాదు. వాళ్ళదేదీ వాళ్ళకొక్కకుండా ఎవరో దోచుకోడంవల్ల జనానికి తినేందుకూ. కట్టుకువేందుకూ ఏమీ లేకుండాపోయిందిట. మేం కష్టపడి పని చేస్తున్నప్పటికీ మాకు తిండీ బట్టా ఎందుకు లేకుండాపోతున్నాయని జనం అడిగితే, ల్లల్ని కనడం మానెయ్యండని సలహా యిచ్చేరుట పాలకులు. పాలకుల మాటల్ని హాస్యంగా అర్థం చేసుకోవాలో, పక్కదారి పట్టించే ప్రయత్నంగా అర్థం చేసుకోవాలో జనానికి బోధపడలేదుట. వాళ్ళు యింకా ఎక్కువగా గోల చేసేరుట.

అప్పుడు పాలకవర్గంవారు తప్పని సరై పక్కదేశంతో చిన్నయుద్ధం చేసేరుట. ఆ యుద్ధం గెలిచి, మీరంతా యుద్ధం గెలిచేరని జనాన్ని పొంగెయ్యడానికి ప్రయత్నించేరుట పాలకులు. జనంకూడా, దేశభక్తిపరులై కొన్నాళ్లు అలాగే పొంగిపోయేరుట. కొన్నాళ్ళయేక జనం మళ్ళీ తిండీ బట్టా కావాలని అడిగేరుట. యుద్ధానికి మీ తిండీబట్టా ఖర్చైపోయేయి, మీకు గెలుపు మిగిలిందని చెప్పేరుట పాలకులు. దేశభక్తితో కడుపు నింపుకోమనికూడా వారు సలహా యిచ్చేరుట. దేశభక్తితో కడుపు నిండకపోవడంచేత జనం మళ్ళీ కేకలు వేసేరుట.

"అదిగో. కాకెత్తుకుపోయింద"న్నట్టు, ఇదిగో. కరువొచ్చి మీ తిండీ బట్టా మాయమైపోయేయన్నారుట పాలకులు.



తిండి దొరకడంలేదు కనక తిండి ధర పెంచేస్తున్నామన్నారుట వర్తకులు. ఆ విధంగా జనానికి అధిక ఆకలివల్ల చావులీన్నీ వర్తకులకి అధిక ధరలవల్ల లాభాలీన్నీ ఇచ్చి ప్రభుత్వంవారు పడుకున్నారుట.

వాళ్ళదేదీ వాళ్ళకొక్కకుండా దోచుకపోయినవాళ్ళు జనానికి నల్లబజార్లో తిండి 'వాసన' చూపించి వాళ్ళ గోచీముక్కలు కూడా దోచుకుపోయేర్ట. దిగంబరులైపోయిన జనం 'అన్యాయం. అన్యాయం' అంటూ ఆక్రందనలు చేసేరుట. శాంతియుతంగా పాలకులకు మొరపెట్టుకున్నారుట.

'న్యాయం, అన్యాయం' అనే పదాలు మేం గుత్తకి తీసుకున్నాం కనక ఆ మాటలు మీరంటే అది నేరంగా పరిగణింపబడుతుందనీ తగు చర్యలు తీసుకోవలసి వస్తుందనీ హెచ్చరిస్తూ కళ్ళెర్ర చేసేరుట పాలకులు. మీకు తిండి బట్టా కావాలంటే మరింత బాగా కష్టపడండన్నారుట. కష్టపడిన కొద్దీ దోచుకుపోతున్నారని జనం గోల పెడితే, అలాగ గోల పెట్టినం[illegible] జైళ్ళలోకి తోసేరుట. మరి కొందర్ని కాల్చి చంపేరుట.

పాలకుల వెకిలి చేష్టలకీ, దౌర్జన్యానికి విసిగిపోయిన జనం, యిప్పుడేం చెయ్యాలో అందరూ కలిసి ఆలోచించుకునేందుకు అక్కడ చేరేర్ట. అలాగ జనం అంతా ఒక చోట చేరకూడదని పాలకులు హెచ్చరించినా వినకుండా అక్కడ చేరేర్ట జనం.

అక్కడికి తండోపతండాలుగా చేరేర్ట జనం ఒకే శరీరంమీద కొన్ని కోట్ల తలకాయలు దగ్గర దగ్గరగా పేర్చినట్టు క్రిక్కిరిసిపోయేర్ట జనం. దూరంగా ఒక ఎత్తైన మేడమీంచి చూస్తున్న ఒక పాలక ప్రతినిధికి సముద్రం అంతా ఆ మైదానంలోకి వచ్చేసిందేమోనని ఒక్క క్షణం భ్రాంతి కలిగిందిట.

ఆ జనం అంతా ఒకేలాగ కనిపిస్తున్నారుట. వాళ్ళందరివీ ఒకే రకం బాధలు. ఒకే రకం సమస్యలు .. అందరివీ అవే ఆర్తనాదాలు ... అవే ఆక్రోశాలు ...వాళ్ళందరి నెత్తిమీదా ఒకే ఎండ. వాళ్ళందరి కళ్ళ ముందు ఒకే చీకటి. వాళ్ళందరివి ఒకే

ఆకలి, అందరిదీదిగంబరత్వమే! అందరూ ఆ మధ్యాహ్నంపూట, ఆ మండుటెండ వేళ ఆమైదానంలో అలాగచేరేక, వాళ్ళల్లో ఒక్కొక్కరూ లేచి మాట్లాడుతున్నారుట. ఆ మాటలు అక్కడి జనం గుండెల్లో ... కోట్లాది గుండెల్లో ప్రతిధ్వనించి ... పాలకుల గుండెల్లో ఏదో భయాన్ని ధ్వనించేయిట.

* * *

అంతలో అలజడి.

ఆర్తనాదాలు .. దారి తెలియని పరుగులు, ఒకరిమీద ఒకరు పడుతూ లేస్తూ భయంగా వొణికిపోతున్న జనం....

అన్ని వేపులా ఆకాశాన్నంటుతోందా అన్నట్టు అతి ఎత్తుగా నిలిచిన గోడ, మైదానాన్ని బంధించిన జైలుగోడ లాగ ఎత్తైన గోడ....శాస్త్రాల్లాంటి, చట్టాల్లాంటి, "మహాత్ము"ల ప్రవచనాల్లాంటి, మతం లాంటి, పాలకుల సిద్ధాంతాల్లాంటి. పాలకుల చర్యల్లాంటి, అజ్ఞానంలాంటి, భయం లాంటి పెద్ద గోడ ... మైదానాన్ని బంధించిన గోడ .. జనానికి దారి తెలియకుండా గోడ .. ఎవరూ ఎక్కలేనంత పెద్దగోడ. నాలుగు వేపులా భూతంలాగ నిలిచిన ఆ గోడకి ఒకేఒక్క ద్వారం. అతి చిన్న ద్వారం... ఆ ద్వారాన్ని మూసేస్తూ పగబట్టిన పాలకవర్గంలాగ నిలబడిన మర ఫిరంగి ... ఫిరంగిలోంచి దోపిడీ నిప్పులు చిమ్ముతూ దారికడ్డంగా నిలబడ్డ పాలకవర్గం....ఆకలి చావుల్లాంటి నిప్పుల దెబ్బలకి రక్తాలు చిందుతున్న జనం... అందరి రక్తాలూ ఒక్కటై అందర్నీ తడుపుతున్న రక్తం .. ఒకే రక్తం చింది ఒకేరక్తంలో తడుస్తున్న జనం... గోడముందు ప్రాణాలకి విలువలేదు .... ఫిరంగికి రక్తంమీద ప్రేమలేదు.

నెత్తిమీద ఎండ.

నాలుగువైపులా మైదానాన్ని బంధి చేసిన గోడ....

ఉపన్యాసాలకి విలువలేదు. ఉపన్యాసాలు ఫిరంగి దెబ్బల్ని తట్టుకోలేవు.

భయంతో, విహ్వలత్వంతో ఎవరికివారు దిక్కు తోచకుండా పరుగులు పెడుతున్న జనాన్ని రక్తం ఏకం చేసిందట. ఒకరినొకరు గోడ దాటే ప్రయత్నం చేస్తే వాళ్ళని, ఫిరంగి నేల రాల్చిందట. అప్పుడు ఆ గోడని, ఆ ఫిరంగి దెబ్బల్ని తప్పించుకునే మార్గం వాళ్ళకి ఒక్కటే తోచిందట.

అందరి దృష్టి మరఫిరంగిమీదకే! ....కోటికాళ్ళ జనం...ఒకే జనం! కోటి తలల జనం .. ఒకే నడక, ఒకే దిక్కు....

ఫిరంగి నిప్పులు చిమ్ముతోంది వరసగా రాలిపోతున్నారు. జనం అయినా నడుస్తున్నారు ద్వారానికి దగ్గరగా, అతి దగ్గరగా వచ్చేరు జనం. ఫిరంగి పిచ్చిపిచ్చిగా, భయం భయంగా అరుస్తోంది. రాలిపోతున్న జనం రాలిపోగా, జన ప్రవాహం ముందుకే నడుస్తోంది.

ఊరుకుంటే అందరూ చస్తారు. ఎదిరిస్తే, కొందరి చావు ఎందరి ప్రాణాల్నో రక్షిస్తుంది. అదీ వాళ్ళ ధీమా....అదేవాళ్ళ ధైర్యం ..అందుకే వాళ్ళందరి మధ్యనా ఐక్యత ...

ఒక సాహసి ఫిరంగి గొట్టంలోకి తల దూర్చేడు. ఫిరంగి గొంతు నొక్కడానికా అన్నట్టు వీలైనంత లోపలికి ప్రవేశించేడు. అతని వెనక, ఆ వెనక, ఆ వెనక ఫిరంగి గొట్టం మీదికే శక్తినంతా కేంద్రీకరించి ఉప్పెనలాగ ముందుకి తోసుకుపోతున్న జనం .. ఫిరంగి పేలింది...తునాతునకలై పోయింది. ద్వారానికి రెండు వేపులా గోడ బద్దలై పోయింది.

ఆ విధంగా కొందరి రక్తం కోటి మందికి ధైర్యాన్నిచ్చిందట. కొందరి త్యాగం కోటిమందికి కొత్తదారి చూపిందట!

* * *

యిదీ మరో జలియన్‌వాలా బాగ్!

★